


## గురుకుల పాఠశాలలో నాడు నేడు పథకంతో మౌలిక వసతులు



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను నాడు నేడు పథకం కింద అన్ని మౌలిక వసతులతో సుందరంగా తీర్చిదిద్దేందుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరు వారి క్యాంపు కార్యాలయంలో నాడు నేడు పథకం రెండో దశ కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు గురుకుల పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నాడు నేడు పథకం కింద రెండో దశ కింద జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుందన్నారు. వాటిలో ముఖ్యంగా మరుగుదొడ్లు, విద్యుదీకరణ, తాగునీరు, ఫర్నిచర్, రంగులు వేయడం, చిన్న, పెద్ద మరమ్మతులు చేపట్టడం, వంటగది ఆధునీకరణ, ప్రహరీల నిర్మాణం, దోమల నివారణ ఏర్పాట్లు, క్రీడా సామగ్రి గ్రంథాలయ పుస్తకాలు సమకూర్చుట, పరిసరాల పరిశుభ్రత వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉంటుందన్నారు. వసతి గృహాలను రెండు దశల్లో, గురుకుల పాఠశాలలను మూడు దశల్లో అభివృద్ధి చేయాలని తెలిపారు. ఇందుకోసం తొలుత ఒక వసతి గృహాన్ని, ఒక గురుకుల పాఠశాలను ఎంపిక చేసి వాటిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం కోవూరులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, ముత్తుకూరులోని ఎస్సీ గురుకుల పాఠశాలను సంబంధిత ఏజెన్సీలు తనిఖీ చేసి అవసరమైన మౌలిక వసతులు సమకూర్చేందుకు అయ్యే ఖర్చుల అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. అంతకుమునుపు బిసి సంక్షేమ అధికారి వెంకటయ్య మాట్లాడుతూ నాడు నేడు పథకం రెండో దశ కింద 74 సంక్షేమ వసతి గృహాలను అభివృద్ధిపరిచేందుకు ఎంపిక చేశామని కలెక్టరుకు వివరించారు. అందులో 36 ఎస్సీ, 35 బీసీ, మూడు గిరిజన సంక్షేమ వసతి గృహాలు, 11 ఎస్సీ, బీసీ, గిరిజన గురుకుల పాఠశాలలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో మందా రాణి, సర్వశిక్ష సహాయ ప్రాజెక్ట్ సమన్వయకర్త ఉషారాణి, గురుకుల పాఠశాల సమన్వయకర్త హేమలత, సర్వశిక్ష కుమార్ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

## ఎగిసి పడుతున్న అలలు



**విడవలూరు నవంబర్ 11 ప్రభాతవార్త** విడవలూరు మండలం రామతీర్థం బీచ్‌లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉదయం నుండి చీకట్లు కమ్ముకున్నాయి. జోరువానతోపాటు గాలి తీవ్రత హోరెత్తించింది. అల్పపీడనం కారణంగా అలల ఉధృతి ఎక్కువై సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో అప్రమత్తమైన అధికారులు రెవిన్యూ పోలీస్‌శాఖవారు మత్స్యకారులను వేటకు వెళ్లరాదని పరిసరప్రాంతంలోని ప్రజలికు హెచ్చరికలు జారిచేశారు.

# 15 నుంచి కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే




**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** జిల్లాలో కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందించాలని, ఈ నెల 15 నుంచి డిసెంబర్ 5 వరకు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో కుష్టు వ్యాధి నిర్మూలనకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, లక్షణాలను గుర్తించడం, చికిత్స అందించడం వంటి అంశాలపై జిల్లా వైద్యాధికారి పెంచలయ్య కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వలంటీర్లు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సర్వే కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారులు, వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో కుష్టు వ్యాధి ప్రబలకుండా, అన్ని ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, జెడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ సతీష్ చంద్ర, డాక్టర్ కె.పవిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## జెబి కళాశాలలో సదుపాయాలు కల్పించాలన్నదే యూనివర్శిటీ ఆశయం



**కావలి రూరల్, నవంబరు 11 ప్రభాతవార్త** కావలి జవహర్ భారతి కళాశాలలో అటు విద్యార్థులకు, ఇటు స్పోర్ట్స్‌కు కావాల్సిన అన్ని సౌకర్యాలు వున్నాయని, విక్రమ సింహపురి యూనివర్శిటీ కూడా అన్ని వసతులు కల్పించాలన్నదే ఆశయమని విక్రమ సింహపురి యూనివర్శిటీ ఉపకులపతి జి.యం.సుందరవల్లి తెలిపారు. కావలి జవహర్ భారతి కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం విక్రమ సింహపురి యూనివర్శిటీ అంతర్‌కళాశాలల ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఉపకులపతి జి.యం.సుందరవల్లి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. క్రీడల పట్ల విద్యార్థులు మక్కువ చూపేలా కళాశాలల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. పోటీలలో గెలుపోటములు సహజమన్నారు. దృఢ సంకల్పంతో వెళ్లాలన్నారు. పరీక్షలు జరిపే విధానంలో గానీ, స్పోర్ట్స్ విషయంలో గాని, విద్యకు సంబంధించిన విషయంలో గానీ జవహర్ భారతి కళాశాలకు సహకారం వుంటుందన్నారు. విశ్వోదయ వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి ఈ కళాశాల స్థాపించేందుకు ఎంతో కృషి, పట్టుదలతో నెలకొల్పారన్నారు. ఇక్కడ వున్న పరిస్థితులను బట్టి అర్థమవుతుందన్నారు. ఆయన ఒక మహోన్నతమైన విద్యా ప్రదాత అన్నారు. రాబోవు అథ్లెటిక్స్ కూడా అన్ని వసతులు వున్న జవహర్ భారతి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. విక్రమ సింహపురి యూనివర్శిటీ అంతర్‌కళాశాలల ఆటల పోటీలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న విశ్వోదయ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రమణ్యంనాయుడు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ కె.సునీత, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.ప్రసాద్‌రెడ్డి, వివిధ కళాశాలల పిడిలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సెబ్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జాయింట్ డైరక్టర్



**ఉదయగిరి నవంబర్ 11 ప్రభాతవార్త** ఉదయగిరి సెబ్ కార్యాలయాన్ని జాయింట్ డైరక్టర్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ కమీషనర్ రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరెండెంట్ కృష్ణ కిషోర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా జాయింట్ డైరక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతు 2020 మే నెలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సెబ్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ విభాగం యొక్క ముఖ్య ఉద్దేశం అక్రమ మద్యాని అరికట్టడం, గుట్కా తదితర మాదక ద్రవ్యాల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విముక్తి కలిగించడం అని చెప్పారు. ఎవ్వరైనా ముఖ్యమంగా కర్నాటక, తమిళనాడు, తెలంగాణా, రాష్ట్రాల నుండి అక్రమమద్యాన్ని తరలించడం లాంటివి జరిగితే కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ విభాగం ఇప్పటికే అక్రమమద్యాన్ని అనేక రకాలుగా అరికట్టడంలో సఫలీకృతమైందని తెలిపారు. కమీషనర్ సూచనలు మేరకు 14500 అనే టోల్ ప్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ నెంబర్‌పై 24 గంటలలో ఎవ్వరైనా పోన్ చేసి అక్రమ మద్యంగాని మత్తు పదార్థాలు గాని, అక్రమ ఇసుక గురించి గాని ఫిర్యాదులు ఇవ్వవచ్చనని తెలిపారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** జిల్లా పోలీసు కార్యాలయంలో భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం 135వ జన్మదినం పురస్కరించుకుని వారి చిత్రపటానికి పూలమాల వేసి శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన తొలి వ్యక్తి అని, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి అని, గుణాత్మక విద్యకు మార్గదర్శి విద్యావేత్త అన్నారు. స్వాతంత్ర్యం ఏర్పడిన అనంతరం మొదటి ప్రభుత్వంలో సుదీర్ఘంగా 11 సంవత్సరాల పాటు విద్యాశాఖా మంత్రిగా పని చేసిన గొప్ప మేధావి అన్నారు. బ్రిటీషు పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, కళలు, సంగీతం, సాహిత్యాల వికాసానికి చేయూత ఇచ్చిన వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. 1992లో భారత ప్రభుత్వం మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు భారత రత్న అవార్డు ఇచ్చి సత్కరించిందని తెలిఎపారు. 1958 ఫిబ్రవరి 22న మౌలానా అబుల్ కలాం ఆజాద్ మరణించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని స్టేషన్‌లలో ఘన నివాళులు అర్పించారని ఎస్పీ విజయరావు పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి



**నెల్లూరు టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** అర్బన్ పట్టణ సమైక్య ప్రాతినిధ్య సభ సమావేశం నెల్లూరులోని మహిళా స్వశక్తి భవనం వద్ద శుక్రవారం జరిగింది. జిల్లాలోని అన్ని పట్టణాలతో ఏర్పడిన అర్బన్ జిల్లా సమైక్య యొక్క ప్రాతినిధ్య మహాసభ సమావేశంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర మాట్లాడుతూ జిల్లా సమైక్య పాత్ర నేడు ఎక్కువగా ఉందని, జిల్లాలో కొత్తగా చేరిన మున్సిపాలిటీలలో కలుపుకుని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అర్బన్ సమైక్య ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఈ అర్బన్ జిల్లా సమైక్య పనితనం బలోపేతానికి కృషి చేస్తుందని తెలిపారు. నాయకత్వ లక్షణాలు కలిగిన నాయకులుగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని పట్టణాలు, కార్పొరేషన్‌లోని తొమ్మిది పట్టణ సమైక్యాలు కావలి, ఆత్మకూరు, కందుకూరు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రాతినిధ్య సమావేశానికి టి.సుధాకర్, సురేంద్ర, హర్షిత, సి.ఎం.ఎం.భారతతి, అన్ని పట్టణ సమాఖ్యాధికారులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అర్బన్ జిల్లా సమైక్య పదాధికారులు అధ్యక్షురాలుగా డి.జ్యోతి, ఉపాధ్యక్షురాలిగా ఎ.లక్ష్మి, కార్యదర్శిగా ఎల్.భవాని, సహాయ కార్యదర్శిగా సౌజన్య, కోశాధికారిగా శాంతి, మరికొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలు జ్యోతి సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## గౌతంరెడ్డి బ్యారేజిని సందర్శించిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి



**సంగం నవంబర్ 11 ప్రభాతవార్త** సంగంలోని మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజిని మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి కుమారుడు మేకపాటి కృష్ణార్జునరెడ్డి బ్యారేజి వద్ద దివంగతనేత మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహాన్ని సందర్శించారు. ఈ సందర్బంగా మేకపాటి గౌతంరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించారు. గౌతమ్‌రెడ్డి కుమారుడు కృష్ణార్జునరెడ్డి బావోద్వేగానికి గురైయ్యారు. వైసిపి నాయకులు కంఠాబత్తిన రఘునాదరెడ్డి, జిల్లా కో ఆప్షన్ మెంబర్ గాజుల తాజుద్దీన్, పెరుమాళ్ళు రవీంరదబాబు, షేక్ జహంగీర్, పట్టెం వేణు, జనార్ధన్‌రెడ్డి, శివ, పెంచలయ్య, కరుణాకర్, మనోహార్, మురళీ పాల్గొన్నారు.

## మహనీయులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన దేశంలో విద్యా వ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేసిన మహనీయులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, ఆప్కాస్ చైర్‌పర్సన్ షేక్ సైదాని, ముస్లిం సంచార జాతుల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సయ్యద్ ఆసిఫా, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌లతో కలిసి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ దేశ మొదటి విద్యాశాఖా మంత్రిగా పని చేసి గొప్ప విద్యా విధానానికి మంచి పునాది వేసి విద్యా వ్యాప్తికి పెద్ద ఎత్తున కృషి చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, స్వతంత్ర్య భారత తొలి విద్యాశాఖా మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలకు గుర్తుగా ఏటా నవంబరు 11న జాతీయ విద్యా దదినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు మాట్లాడుతూ దేశ విద్యారంగ అభివృద్ధికి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. దేశ మొదటి విద్యాశాఖా మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ నాటిన విద్యా విత్తనాల వలనే విద్యా వృక్షం అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తుందన్నారు. ముందు చూపుతోనే నేడు ఇతర దేశాలకు తలమానికంగా విశ్వ విద్యాలయాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. నగర మేయర్ పొట్లూరి స్రవంతి మాట్లాడుతూ భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖా మంత్రిగా విద్యారంగం అభివృద్ధి కోసం, లలిత కళలను ప్రోత్సహించేలా ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. విద్యా వ్యాప్తిలో భాగంగా మూడు అకాడమీలను ఏర్పాటు చేసిన ఘనత వీరికి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఆప్కాస్ చైర్‌పర్సన్ షేక్ సైదాని, ముస్లిం సంచార జాతుల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సయ్యద్ ఆసిఫా, పలువురు ముస్లిం మత పెద్దలు దేశంలో విద్యారంగం అభివృద్ధికి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలను ప్రశంసిస్తూ ప్రసంగించారు. అనంతరం ఇటీవల లలితకళలు, సంస్కృతి విభాగంలో రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత అవార్డు వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డును స్వీకరించిన ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రానికి చెందిన గౌసియా బేగంను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన ముస్లిం ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది. ఆర్‌డీవో మాలోల, విద్యాశాఖ ఆర్‌జెడి సుబ్బారావు, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి కనకదుర్గ భవాని, జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి, డిఎస్‌డబ్ల్యూవో వెంకటయ్య, ఐసిడియస్ పిడి సౌజన్య,, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి



**నెల్లూరురూరల్, నవంబరు11 ప్రభాతవార్త** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని కలెక్టర్ కె.వి.ఎన్ చక్రదర్‌బాబు తెలిపారు. శుక్రవారం రూరల్ పరిధిలోని కనుపర్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్నభోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం జగనన్న పచ్చతోరణ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. సౌ 'ట్స్ అండ్ గైడ్స్ చేత మొక్కలు నాటించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొక్కలు నాటడంతో పాటూ సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ ఎపిఒ ఉషారాణి, ఇన్‌చార్జ్ డిఇఒ వియస్ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయురాలు సునిత, , స్థానిక కార్పోరేటర్ శాంతి, వైకాపా డివిజన్ అధ్యక్షులు అరవ శ్రీను, స్థానిక వైకాపా నాయకులు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల అధికారుల హాజరు తప్పనిసరి



**కోవూరు, నవంబరు11 ప్రభాతవార్త :** కోవూరు మండలానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనులు సమీక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిన అవసరం ఉందని జిల్లా పంచాయతీ అధికారిణి ఎం. ధనలక్ష్మి అన్నారు. కోవూరులోని మండల సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని వివిధ శాఖల అధికారులు , గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో స్వామిత్వపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో ముఖ్యంగా రివిజన్ రిజిస్టర్, అసెస్‌మెంట్ రిజిస్టర్, 1బి రిజిస్టర్, హ్యాబిటేషన్ బౌండ్ రిజిస్టర్, స్టోన్ అకౌంట్ రిజిస్టర్, గ్రామ కంఠంకు సంబంధించి రిజిస్టర్ తప్పనిసరిగా సంబంధిత పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, విలేజ్ సర్వేయర్ దగ్గర తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ రిజిస్టర్లను పారదర్శకంగా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రజలు కూడా ఈ సర్వే కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సర్వే వలన పారదర్శకంగా భూములకు సంబంధించిన రికార్డులు నమోదు అవుతాయన్నారు. అదేవిధంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి జగనన్న కాలనీలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో అలసత్వం లేకుండా నిర్మాణాలు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లేఅవుట్ వారీగా ప్రగతిపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఎంపీడీవో శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, మండల సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

## యల్లకర అంజనికి గోల్డ్‌మెడల్ ప్రధానం



**నెల్లూరు, నవంబరు11 ప్రభాతవార్త-విద్య** నెల్లూరు నగరానికి చెందిన యల్లకర అంజని 2020 సంవత్సరానికి గానూ బిఫార్మసీలో యూనివర్శిటీ ప్రథమర్యాంకును సాధించినందుకుగాను శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆ విద్యార్థినికి బంగారు పతకాన్ని అందజేసింది. శుక్రవారం తిరుపతిలో జరిగిన కాన్వగేషన్ బహూకరణ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ చేతులమీదుగా ఈ మెడల్‌తోపాటూ ప్రశంశాపత్రాన్ని అందుకోవడం జరిగింది. కాగా 2019 సంవత్సరంలో జపాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు ఎంపికై అక్కడకు వెళ్లి సదస్సులో సైతం పాల్గొని దేశ వాణిని అంజని వినిపిందించి. ఇందుకుగాను ఆదేశం ఆమెకు ఉచిత విద్యా అవకాశాన్ని కూడా ఇవ్వటం జరిగిందని విద్యార్ధిని తల్లిదండ్రులు ప్రభాతవార్తకు తెలిపారు. కాగా బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకుని పేదలకు నిస్వార్ధంగా సేవ చయటమే తన లక్ష్యమని అంజని పేర్కొన్నారు. నగరానికి చెందిన అంజనికి గోల్డ్‌మెడల్ రావటం పట్ల పలువరు హర్షం వ్యక్తంచేశారు.

# కార్తీక మాస లక్ష దీపోత్సవం ప్రారంభం







**నెల్లూరురూరల్, నవంబరు11 ప్రభాతవార్త** విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటి నిర్వహణలో నగరంలోని విఆర్ కళాశాల మైదానంలో శుక్రవారం కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. రాజ్యసభసభ్యులు, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, టిటిడి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ప్రత్యేక శ్రద్ధతో ఈ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం గణపతి పూజ, ఉజ్జయిని మహాదేవుని శివలింగ ప్రతిష్ట, కలశ స్థాపన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మహాన్యాస పూర ్వక శత రుద్రాభిషేకం నిర ్వహించారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతుల పర్యవేక్షణలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు విరివిగా దీపోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కుర్తాళం సిద్దేశ్వరీ పీఠాధిపతులు సిద్దేశ్వరానంద భారతి స్వామి అనుగ్రహభాషణం చేశారు. ఈసందర్భంగా మహాదేవునికి విశేష భస్మాభిషేకం, ప్రత్యేక హారతులు జరిగాయి. నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితర ప్రముఖులు దీపోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దీపోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి భగవంతుని కృపకు పాత్రులయ్యారు.

## భూరక్ష పథకంపై అవగాహన కార్యక్రమం




**ఉదయగిరి నవంబర్ 11 ప్రభాతవార్త:** జిల్లా పంచాయితీ అధికారుల ఆదేశాను సారం శుక్రవారం ఉదయగిరి మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్షక పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విఆర్ఒలు, మండల సర్వేయర్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో తహసిల్దారు సానా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు పథకం ద్వారా రైతులకు శాశ్వత మేలు జరుగుతుందని తెలిపారు. భూచట్టాలన్ని సరైన సర్వే ద్వారా క్రమబద్దీకరించి రైతులకు మేలు కలిగే విధంగా ఈ పథకం వారికి ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ సదస్సులో ఎంపిడిఒ హైజాక్ప్రవీణ్, విఒఆర్డి శ్రీనివాసులు, మండల సర్వేయర్లు, పంచాయితీ కార్యదర్శులు, విఆర్ఒలు, సచివాలయ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, శిక్షణా తరగతులలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నారా లోకేష్‌బాబును కలిసిన కావలి గుంటుపల్లి దంపతులు



**కావలి, నవంబరు 11 ప్రభాతవార్త:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్‌బాబును శుక్రవారం కావలి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, ఆర్‌టిఎస్ రాష్ట్ర ట్రైనర్ గుంటుపల్లి శ్రీదేవి చౌదరి దంపతులు కలిశారు. బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఆర్‌టిఎస్ రాష్ట్ర ట్రైనర్‌గా వివిధ నియోజకవర్గాలలో ఆమె చేస్తున్న కార్యక్రమాలను నారా లోకేష్‌కు వివరించారు. విశేష ఆదరణతో పాటు మంచి ఫలితాలు వస్తున్న ఆర్‌టిఎస్ కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగించాలని నారా లోకేష్ గుంటుపల్లి శ్రీదేవిని అభినందించారు. 2024లో తెలుగుదేశం పార్టీ తిరిగి ఈ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా పాటుపడాలని గుంటుపల్లి దంపతుల్ని ఆయన కోరారు. ఒక మహిళగా టిడిపి పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషిని పార్టీ మరిచిపోదని శ్రీదేవి చౌదరికి తెలిపారు. గుంటుపల్లి దంపతులకు పార్టీలో మంచి గుర్తింపు వుంటుందని నారా లోకేష్ భరోసా ఇచ్చారు.

## స్వమిత్వపై శిక్షణ



**బిట్రగుంట, నవంబర్11, ప్రభాతవార్త:** బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వమిత్వ కార్యక్రమంలో భాగంగా వై.ఎస్.ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పదకం గూర్చి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎం.పి.డి.ఒ ఆర్.గోవిందరావు అద్వర్యంలో జరిగిన ఈశిక్షణాకార్యక్రమంలో ఇ.ఒ.పి.ఆర్ డి శ్రీదేవి, మండల సర్వేయర్ ప్రసాద్, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు, వి.ఆర్.ఒలు సచివాలయ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణనిచ్చారు.

## చల్లా శీతయ్యకు నివాళులర్పించి సోమిరెడ్డి,బీద



**బిట్రగుంట, నవంబర్11, ప్రభాతవార్త:** బోగోలు మండలం అనంతబట్లవారికండ్రిక మాజీ సర్పంచ్ చల్లా. శీతయ్య పార్ధివ దేహానికి శుక్రవారం రాష్ట్ర టి.డి.పి పోలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టి.డి.పి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్రలు ఘనంగా నివాళులర్పించారు. ఎ.బి కండ్రిక మాజీ సర్పంచ్, సీనియర్ టి.డి.పినేత చల్లా శీతయ్య గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాదపడుతు గురువారం మృతిచెందాడు. కాగా ఆయన అంత్యక్రియల్లో మాజీ మంత్రి టి.డి.పి పోలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టి.డి.పి జాతీయ ప్రధానకార్యదర్శి బీద.రవిచంద్ర, కావలి నియోజకవర్గ టి.డి.పి ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడులు పాల్గొని ఘనంగా నివాళులర్పించడంతో పాటు వారి కుటుంభ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. మండలంలో టి.డి.పి బి.సి సామాజిక వర్గంలో ఒక గొప్ప నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరనిలోటుగా పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావంనుండి చురుకైన పాత్రని పోషించడం వారు గుర్తుచేసుకున్నారు వారి వెంట మండల టి.డి.పి అధ్యక్షుడు మాలేపాటి.నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు వివిధ అనుబంధ విభాగాలకు చెందిన జిల్లా, మండల నేతలు పాల్గొన్నారు.

## బిట్రగుంటలో రైల్వే సి.ఎమ్.ఎస్.ఒ ఆకస్మిక తనిఖీలు



**బిట్రగుంట, నవంబర్11, ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం దక్షిణమధ్యరైల్వే ఛీఫ్ మెడికల్ సూపర్‌నెంట్ శ్రీలక్ష్మి ఆకశ్మిక తనిఖీలు నిర్వహించారు. బిట్రగుంటలో త్వరలో దక్షణమధ్యరైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌జైన్ పర్యటించనున్న సందర్భంగా సికింద్రాబాద్‌కు చెందిన రైల్వే మెడికల్ అధికారులు బిట్రగుంటలోని రైల్వే మెడికల్ రిలీఫ్ బోగిని, రైల్వే ఆసుపత్రి, రైల్వే క్యాంటిన్ తదితర విభాగాలను తనిఖీలు చేశారు. ఆమె వెంట ఎ.సి.ఎం ఎస్.ఒ వేణుగోపాల్‌రెడ్డి, ఎఫ్.ఎస్.ఒ రహంతుల్ల, హెల్త్ ఇన్‌స్పెక్టర్ లలిత్, రైల్వే డాక్టర్ సుధాకర్‌లు వున్నారు.

## కావలి కొత్త డిఎస్పీ వెంకట రమణను సత్కరించిన బిజెపి నేతలు



కావలి, నవంబరు 11 ప్రభాతవార్త: కావలి నూతన డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన యం.వెంకట రమణను శుక్రవారం కావలి డిఎస్పీ కార్యాలయంలో బిజెపి నేతలు దుశ్శాలువాతో సత్కరించారు. ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఆఫ్ ట్రేడ్ సభ్యులు, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు కందుకూరి వెంకట సత్యనారాయణ, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, పట్టణ బిజెపి అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం, జిల్లా కార్యవర్గ సభ్యులు పరుసు వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి వాయుగండ్ల సుధీర్, మందా కిరణ్‌కుమార్, బిజెవైయం జిల్లా ఉపాధ్యక్షులు మర్రి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల అభ్యున్నతికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కృషి భేష్



**నెల్లూరు టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కాకి శ్రీనివాసులు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందన్నారు. అనారోగ్యానికి గురైతే ఆరోగ్యశ్రీ కార్డుతో పాటు దళితుల పిల్లలకు కార్పొరేట్ విద్య, విదేశీ విద్యను అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున అమలు చేస్తుందన్నారు. జిల్లాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దళితుల సమ స్యలకు సంబంధించి వెంటనే స్పందిస్తున్నారని కొనియాడారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్‌గా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితుల సంక్షేమంపై దృష్టి సారిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాలో వెనుకబాటుకు గురైన మాదిగల పట్ల కూడా ప్రత్యేక దృష్టి సారించి రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి తమ మద్ధతు ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మన ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షులు పల్లాల శ్రీనివాసులు, పల్లాల సునీత, బద్దేపూడి వెంకటరావు, చిన్నయ్య, రఘు, నవీన్, సల్మాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపినాపిలో పొట్టేళ్ల దొంగతనం; గూడూరు మార్కెట్లో పట్టుబడిన వైనం

**కలిగిరి, నవంబర్11, ప్రభాతవార్త;** కలిగిరి మండలంలోని ఏపినాపిలో పొట్టేళ దొంగతనం జరుగగా గూడూరు మార్కెట్లో అమ్ముతుండగా పట్టుకున్న వైనం గురువారంవెలుగులోకి వచ్చింది. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కలిగిరి మండలంలోని ఏపినాపిలో నలుగురు రైతులుకు చెందిన 5 పొట్టేళ్లు ఒక మేకపోతు బుదవారం రాత్రి దొంగతనానికి గురైనాయి. దొంగతనం గుర్తించిన రైతులు పరిసరాల్లో ఎతికినా కనిపించలేదు. అయితే అదే గ్రామానికి చెందిన మల్లికార్జున అనేవ్యక్తి పొట్టేళ అమ్మకాలకోసం ఆటోలో గూడూరు సంతకు వెళ్లాడు. దొంగతనం విషయం రైతులు చరవాణీ ద్వారా మల్లికార్జునకు చెప్పి ఒక వేళ గూడూరు సంతలో గమనించమని చెప్పడం జరిగింది. దీనితో గమనిస్తున్న మల్లి కార్జునకు దొంగిలించబడిన పొట్టేళ్లు కొందరు అమ్మకాలు జరుపుతున్నట్లు గుర్తించి ఇతరుల సహాయంతో పట్టుకోవడానికి ప్రయత్నించాడు. అందులో ఒకరు దొరకగా మరోముగ్గురు వ్యక్తులు రెండు పొట్టేళ్లు ఒక మేకపోతుతో వెంట తెచ్చుకున్న కారులో పరారైనారు. దొరికిన వ్యక్తిని అమ్మకానికి పెట్టిన మూడు పొట్టేళ్లు తీసుకొని కలిగిరికి వచ్చి పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందుని పట్టుకొని కేసునమోదుచేసి మిగిలిన వారిగురించి విచారిస్తున్నారు. అయితో అప్పటికే బేరం చేసిన పొట్టేళసొమ్ముతో నిందితులు పరారైనారు.

## రూరల్‌లో అక్షర చైతన్యాన్ని జయప్రదం చేయండి



**నెల్లూరురూరల్, నవంబరు11 ప్రభాతవార్త:** నెల్లూరురూరల్ మండలంలో అక్షర చైతన్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ శైలేంద్రకుమార్ సూచించారు. శుక్రవారం నెల్లూరురూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చక్రదర్‌బాబు ఆదేశాల మేరకు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని గ్రామాల్లో కార్యక్రమం నిర్వహణకు ప్రణాళికను రూపొందించామన్నారు. వాలంటీర్ల ద్వారా నిరక్ష్యరాస్యులను గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల్లో వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. జగనన్న పచ్చతోరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి నిరక్ష్యరాస్యుని చేత మొక్కలు నాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల విస్తరణాధికారి జలజాక్షి, సూపర్‌వైజర్ రాజశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలిసులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## వీఎస్‌యులో జాతీయ దినోత్సవ వేడుకలు



**వెంకటాచలం, నవంబరు 11, ప్రభాతవార్త:** విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య సుందరవల్లీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక దేశానికి మొదటి విద్యాశాఖా మంత్రిగా, ఉపరాష్ట్రపతిగా ఆజాద్ సేవలందించారన్నారు. ఆయన చేసిన సేవలు, దేశ భక్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యా విధానంలో మార్పు తీసుకొచ్చేందుకు కలాం తన వంతు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య విజయానంద్‌కుమార్, సృజనా నాయర్, అల్లం ఉదయ్‌శంకర్, ప్రభాకర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ అజీజ్‌ని కలిసిన దినేష్‌రెడ్డి



**నెల్లూరు నవంబర్ 11, ప్రభాతవార్త-వైద్యం** : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ కార్పొరేషన్ మేయర్ అబ్దుల్‌అజీజ్‌ని శుక్రవారం నగరంలోని హరనాథపురంలోని అబ్దుల్‌అజీజ్ నివాసంలో కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి.దినేష్‌రెడ్డి అబ్దుల్‌అజీజ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం రాజకీయాలను గురించి చర్చించుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ అందరితో కలుగోలుపుగా ఉంటూ, అందరని కలుపుకుంటూ ముందుకుసాగి కోవూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని దినేష్‌రెడ్డిని కోరారు. పోలంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ 2024 ఎన్నికల్లో పార్టీ టీడీపీ ఎమ్మెల్యే సీటును కైవసం చేసుకోవాలన్నారు. వారితోపాటు టీడీపీ అధికార ప్రతినిధి చెముకుల.కృష్ణచైతన్య ఉన్నారు.

## మైనార్టీ దినోత్సవాన్ని ముస్లిం దగా దినోత్సవంగా మార్చిన జగన్



**నెల్లూరు నవంబర్ 11, ప్రభాతవార్త-వైద్యం**రాష్ట్రంలోని ముస్లింలకు గడ్డుకాలం ఏర్పడిందని, మైనార్టీ దినోత్సవాన్ని ముస్లిం దగా దినోత్సవంగా మార్చేసిన ఘనుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జాఫర్‌షరీఫ్, నెల్లూరు పార్లమెంటు మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొయినుద్దీన్ ధ్వజమెత్తారు. శుక్రవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర పార్టీ సూచనల మేరకు నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్ ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా, నగర మైనార్టీ ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొయినుద్దీన్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో మైనార్టీ రోజును అంగరంగ వైభవంగా చేసేవాళ్ళని నేడు నామ మాత్రంగా ఆ కార్యక్రమంగా సరిపెట్టుకున్నారని ఆరోపించారు. గతంలో ముస్లింలకు ఇచ్చిన ఏ పథకాన్ని కూడా వైసీపీ అమలు చేసిన దాఖలాలే లేవన్నారు. అబద్ధపు ప్రచారాలు చేసి ముస్లింలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంటు మైనార్టీ సెల్ అధ్యక్షుడు సాభిర్‌ఖాన్ మాట్లాడుతూ దుల్హన్ పథకం, ఇమామ్‌లకు వేతనాలు కాని ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. ముస్లింల కోసం ప్రత్యేకంగా మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. ఇప్పటికైనా వైసీపీలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, కార్పొరేటర్లు కలిసికట్టుగా ముస్లిం హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నిత్యం మైనార్టీలపై జరుగుతున్న దాడులపై పోరాటం చేస్తుంటే నాపై రూరల్ ఎమ్మెల్యే అండతో పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. హరికుమార్ హత్య కేసులో సూత్రధారులు, పాత్రధారులు మీరు తప్పు చేయకుంటే తాను బహిరంగ ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని సాభిర్ అన్నారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేయాల్సిదంతా చేసి ఏమి తెలియనట్లు నటిస్తున్నాడన్నారు. మీరు చేస్తున్న దారుణాలను ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే మిమ్మల్ని ఇంటి బాట పట్టించేందుకు వారు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఆసిఫ్‌పాషా, నౌషాద్, హాఫీజ్, అస్లం, సత్తార్, కరిముల్లా, ఇక్బాల్, హస్నన్‌ఖాన్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత భూహక్కు పదకం సద్వినియోగం చేసుకోండి



**సీతారామపురం నవంబర్ 11ప్రభాతవార్త:** స్దానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పధకం పై శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి తహసిల్దారు షేక్ షాజియాబేగం మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పధకం ను గ్రామీణ పట్టణ ప్రాంతాలలో స్దిరాస్తి సర్వే చేయించి హక్కు దారులకు హక్కు దృవీకరణ పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని మండలంలో సిబ్బంది టీం వర్కుతో జయప్రదం చేయాలంటు సూచించారు. ఈ సదస్సులో ఇఒపిఆర్డి ఎం బార్గవి, మండల సర్వేయర్, పంచాయితీ కార్యదర్శులు విఆర్ఒలు, సర్వేయర్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

## 23న విజయవాడ రైల్వే డివిజన్‌లో దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ వార్షిక తనిఖీకలు



**బిట్రగుంట, నవంబర్11, ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్‌పరిధిలో ఈనెల23వ తేదీన దక్షిణమధ్యరైల్వే జనరల్‌మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వార్షిక తనిఖీలునిర్వహించనున్నట్లు డివిజన్‌లోని రైల్వే అధికారులకు శుక్రవారం సమాచారమందింది. దక్షిణమధ్యరైల్వే జనరల్‌మేసేజర్ అరుణ్‌కుమార్‌జైన్ విజయవాడ నుండి గూడూరు వరకు వివిధ రైల్వేస్టేషన్‌లలో వార్షిక తనిఖీలు నిర్వహించనున్నట్లు సమాచార మందడంతో రైల్వేశాఖ అధికారులు సమాయత్త మవుతున్నారు. ఇప్పటికే రైల్వే డివిజన్ మేనేజర్ సివేంద్రమోహన్ బిట్రగుంటలో తనిఖీలు నిర్వహించగా వివిధ శాఖల ఉన్నతాదికారులుకూడా ఆయా విభాగాలలో తనిఖీలు చేపడుతూ జి.ఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా సిబ్బందిని సమాయాత్తం చేస్తున్నారు. ఇప్పటికే జి.ఎం పర్యటనతో బిట్రగుంటలో సందడి వాతావరణం నెలకొంది.

## ధాతృత్వంలో మేటి 'చేజర్ల'



**వింజమూరు, నవంబర్11, ప్రభాతవార్త:** మెట్టప్రాంత ముద్దుబిడ్డ , ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత కొట్టాలపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ చైర్మెన్ చేజర్ల సుబ్బారెడ్డి ధాతృత్వంలో మేటి అని వింజమూరు జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు పంచాయతీ పరిధిలోని జైభీంనగర్‌లో నూతనంగా వివాహం చేసుకున్న గుజ్జు చందు -శ్రావణి దంపతులకు చేజర్ల సుబ్బారెడ్డి ట్రస్ట్ ద్వారా 10వేల రూపాయల నగదు చెక్కును చేజర్ల సుబ్బారెడ్డి, జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డిలు అందజేశారు. ఈసందర్భంగా గణపం బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామానికి చెందిన చేజర్ల సుబ్బారెడ్డి తాను సంపాదనలో కొంతమేర పేదలకు సహాయం చేస్తూ ఈ ప్రాంత పేద ప్రజల హృదయాల్లో నిలిచిపోయాడన్నారు. నియోజకవర్గంలో కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా గడిచిన 12సంవత్సరాలుగా అలుపెరుగక నిరంతర శాశ్వత సేవా కార్యక్రమాలను ట్రస్ట్‌ద్వారా అందిస్తు ధాతృత్వంలో మేటిగా నిలిచారన్నారు. ఈసందర్భంగా చేజర్ల సుబ్బారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో తమ ట్రస్ట్ ద్వారా పెళ్ళి కానుకలు, అనారోగ్య బాధితులకు సహాయం , దేవాలయాల నిర్మాణాలకు తోడ్పాటు , మరెన్నో సేవా కార్యక్రమాలకు తన సొంత నిధులను వెచ్చిస్తూ తాను పుట్టిన ఊరికి, నియోజకవర్గానికి ఉడతాభక్తిగా పేద ప్రజలకు సేవలందిస్తున్నా నన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి మండల మాజీ కన్వీనర్ మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, యువనేత గణపం రమేష్‌రెడ్డి, ఉదయగిరి మండల మాజీ ఉపాధ్యక్షుడు గాలిబోయిన శ్రీనివాసులు, నాయకులు చేజర్ల సుధాకర్‌రెడ్డి, కల్లూరి రాజాలు పాల్గొన్నారు .

## షేక్ అమీయా ముబీన్‌ను అభినందించిన జిల్లా కలెక్టర్



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** నెల్లూరు నగరానికి చెందిన షేక్ అమీయా ముబీన్ న్యాయశాస్త్ర విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినందుకు జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు అభినందించారు. తమిళనాడులోని ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో ఈ ఏడాది మేలో జరిగిన పరీక్షలో న్యాయశాస్త్ర విభాగంలో మొదటి ర్యాంకు సాధించి ఈ నెల 10వ తేదీ గురువారం అక్కడ జరిగిన స్నాతకోత్సవంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చేతుల మీదుగా కూడా బంగారు పతకాన్ని, డిగ్రీ పట్టాను అమియా ముబీన్ అందుకున్నారు. అనంతరం ఆమె శుక్రవారం సాయంత్రం తన తల్లిదండ్రులు న్యాయవాదులైన షేక్ ఆరీఫ్ మాలిక్, పఠాన్ కమీల, కలెక్టరేట్ పరిపాలన అధికారి షేక్ షఫి మాలిక్‌లతో కలిసి జిల్లా కలెక్టర్‌ను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. డిగ్రీ పట్టాను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అమీయా ముబీన్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసినందుకు అమియా ముబీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అమియా ముబీన్ కలెక్టరేట్ పరిపాలన అధికారి షేక్ షఫీ మాలిక్, మాజీ ఏపీపీ షేక్ రఫి మాలిక్ సోదరుని కుమార్తె, ప్రస్తుతం ఆమె జిల్లా కోర్టుల జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

## నేడు అల్లూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

**అల్లూరు, నవంబరు 11 ప్రభాతవార్త** అల్లూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎఇ ఖాజా తెలిపారు. అల్లూరు, నార్తు మోపూరు, నార్తు ఆమలూరు, గ్రద్దగుంట, బట్రకాగొల్లు, చెర్లో సంఘం, బీరంగుంట ప్రాంతాలలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

## అల్లూరులో భూరక్ష పథకంపై శిక్షణా కార్యక్రమం



**అల్లూరు, నవంబరు 11 ప్రభాతవార్త** అల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం మండల స్పెషలాఫీసర్ మృదుల, ఎంపిడివో శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ మృదుల మాట్లాడుతూ మం డలంలోని సచివాలయల సర్వేయర్లు, విఆర్వోల సహకారంతో జగనన్న శాశ్వత భూహక్కు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే నాడు-నేడు పనులు, జగనన్న కాలనీలు, ఆర్‌బికె భవ నాల పురోగతి గురించి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో చర్చించారు. డిప్యూటీ తహశీల్దార్ చెంచయ్య, ఇవోపిఆర్‌డి పెంచల వీరేంద్ర, ఎంఇవో నాగేశ్వరరావు, హౌసింగ్ ఎఇ జలీల్, ఎపియం ప్రసాద్, మండల సర్వేయర్ అనురూప్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలింతలకు మేలైన పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**ఆత్మకూరు,నవంబర్11,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని 17వ వార్డులో ని టెక్కే అంగన్‌వాడీ కేంద్రం లో శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మెన్ షేక్ సర్ధార్ బాలింతలకు పౌష్టికాహారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం నుండి వస్తున్న పౌష్టికాహారాన్ని గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులకు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్‌లు, బిస్కెట్స్ పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎం.నారాయణమ్మ, వార్డులోని బాలింతలు, గర్భవతులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .

## జగనన్న గోరుముద్ద పరిశీలించిన కమీటి చైర్మన్



**ఉదయగిరి నవంబర్ 11 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని గండిపాళెం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద లో భాగంగా కమీటి చైర్మన్ షేక్ రియాజ్,వైస్ చైర్మెన్ మాలకొండలరావు, సాధరణ తనీఖి నిర్వహించారు.ఈ సందర్బంగా కమీటి చైర్మన్ రియాజ్ మాట్లాడుతు స్కూల్‌లో జగనన్న గోరుముద్ద పథకంలో అందించే ఆహారంలో నాణ్యతను ఖచ్చితంగా పాటిస్తామని విద్యార్ధులకు మెను సక్రమం గా అందే విధంగా చూస్తామని తెలిపారు.జగనన్న గోరుముద్దు భాగంలో ఎలాంటి అవకతకలకు పాలు పడ కుండా ఖచ్చితంగా మెనుపాటించే విదంగా ఉపాధ్యాయులతో కలిసి అప్పుడప్పుడు తనీఖి చేయడం జరు గుతుందని అందువల్ల విద్యార్ధులకు మెనులో సక్రమంగా అందుతుందని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో తెలుగు టీచర్ శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ మాలకొండలరావు పాల్గోన్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపకపోతే గుణపాఠం చెబుతాం




**కావలి, నవంబరు 11 ప్రభాతవార్త** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వెంటనే ఆపకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పోరాటాల ద్వారా తగిన గుణపాఠం చెబుతామని సిపియం నేతలు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం సిపియం పార్టీ ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రెవెన్యూ అధికారులకు అర్జీ అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపియం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.వెంకయ్య, జి.మధుసూదన్‌రావు,ఎర్రంశెట్టి కృష్ణమోహన్, పి.పెంచల నరసింహం, నాయకులు డి.కృష్ణయ్య, ఎస్.కె.మస్తాన్, రమేష్, డివైఎఫ్ఐ నాయకులు సి.హెచ్.వెంకీ, పి.శ్రీనివాసులు, వి.బాబురావు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్న ప్రధాన ఉక్కు పరిశ్రమను బడా పారిశ్రామికవేత్త ఆదానికి కేంద్రం అప్పజెప్పడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు 16 వేల మంది రైతులు భూములిచ్చారన్నారు. 34 మంది ప్రాణత్యాగం చేశారన్నారు. ప్రజలు ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఈ పరిశ్రమలో ఇప్పుడు వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఇలాంటి ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేస్తే రానున్న రోజులలో బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఉద్యోగవకాశాలు లేకుండా పోతాయన్నారు. ప్రైవేటీకరణను నిలపాలని కొన్నేళ్లుగా అక్కడ ఆందోళనలు సాగుతున్నాయన్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ బాటలో వుందని దుయ్యబట్టారు. అలాగే నెల్లూరు జిల్లాలో వున్న ఒకే ఒక్క దామోదరం సంజీవయ్య విద్యుత్ ప్లాంట్‌ను ఆదానికి అప్పజెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం చూడటం దుర్మార్గమైన విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి అమలు చేయడం దారుణమన్నారు. ఈ రెండు ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరికలు చేశారు.

## మొక్కలను రక్షిస్తే అవి మనల్ని కాపాడతాయి



**నెల్లూరు టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విశ్రాంత ఉప కార్మిక కమిషనర్ రాచపాళెం రఘు పిలుపునిచ్చారు. శుక్రవారం నెల్లూరు బాలాజీనగ ర్‌లోని జగదీష్ నగర్ వైఎస్ రాజన్న పార్కునందు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను మనం కాపాడితే అవి మనల్ని రక్షిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు కనీసం యేటా ఒక మొక్కనైనా నాటాలన్నారు. జన్మదినం, పెళ్లి రోజుల్లో బంధుమిత్ర వర్గాలు మొక్కలు నాటితే గుర్తుగా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో పినాకినీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు, చేతన విశాల్ వర్గీయ, సరోజినీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళ చికిత్సకై వంటేరు ఆర్ధికసాయం



**జలదంకి,నవంబర్11,ప్రభాతవార్త:** కావలి మాజీ శాసనసభ్యుడు,వై ఎస్.ఆర్ కాంగ్రేస్‌పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటి సభ్యులు వంటేరు.వేణుగోపాలరెడ్డి తన స్వంత పంచాయతీ బ్రాహ్మణక్రాక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టి మండల ప్రజల మన్ననలను పొందుతుం డడమే కాక బీదలు,బిక్కి పడుతున్న కష్టాలలో తన వంతు సాయం అందిస్తూ ఔరా అని కొనియాడబడుతున్నాడు.తాజాగా గ్రామానికి చెందిన గిరిజన మహిళ పెంచలమ్మ అనారోగ్యబారీనపడి నెల్లూరులో చికిత్స పొందుతున్న వైనాన్ని తెలుసుకొని వేగంగా స్పందిం చాడు.ఆర్ధికసాయంచేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.ఆమొత్తాన్ని పంచాయతీ సర్పంచ్ ఇండ్ల.సుధా కర్ ద్వారా ఆసుపత్రిలోవున్న దీనురాలికి అందజేసి తన దయాగుణాన్ని చాటుకున్నారు. వంటేరు స్పందనకు గిరిజన కుటుంభం రెండు చేతులెత్తి దండంపెట్టి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ స్తులుకూడా వేనోళ్ళ కొనియాడుతూ భగవంతుని ఆశీస్సులు ఆమహానుభావుడికి మెండుగా వుండాలని కోరుకుంటుండడం విశేషం.

## జగనన్న గృహాల మోసాలను ప్రజలకు తెలియజేస్తాం



**కావలి, నవంబరు 11 ప్రభాతవార్త** జగనన్న గృహాల కేటాయింపులో జరుగుతున్న మోసాలను జనసేన పార్టీ బహిర్గతం చేసి ప్రజలకు తెలియజేస్తామని జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ హెచ్చరికలు చేశారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జనసేన పార్టీ నేతలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి నియోజకవర్గంలోని జగనన్న ఇళ్ల నిర్మాణాలలో భారీ కుంభకోణం, దోపిడీ జరిగిందన్నారు. స్థలాల కొనుగోలులో భారీ ముడుపులు వైసిపి నేతలకు అందాయన్నారు. ఎకరా 10 లక్షలకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి 50 లక్షలకు పైగా అమ్మి వైసిపి నేతల ప్రజల, ప్రభుత్వ ధనాన్ని కోట్ల దోచుకున్నారని దుయ్యబట్టారు. కావలి భూముల కేటాయింపులో ఆనాటి జిల్లా కలెక్టర్ శేషగిరిరావు వైసిపి నేతలు చెప్పినట్లు వినలేదని ఆయనను బదిలీ చేయించిన ఘనత కావలి ఎమ్మెల్యేకు దక్కిందన్నారు. ఈ నెల 12,13 తేదిలలో కావలి నియోజకవర్గంలో జగనన్న గృహాల నిర్మాణాల తీరు, దోపిడీ విధానం స్వయంగా వెళ్లి తెలుసుకుంటామన్నారు. ఈ నెల 14న ప్రతి సచివాలయానికి వెళ్లి బాధితులకు జరుగుతున్న మోసాలు, జాప్యం, అవినీతిపై సమాచారం రాబడతామన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు రోడ్ల దుస్థితిపై నిరసనలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వ పాలన దుస్థితిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదే పద్ధతిలో జగనన్న ఇళ్ళ అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేస్తామన్నారు. ఆరు అంకణాల జగనన్న ఇళ్లు నిర్మించుకోలేమని తమకు ఈ ఇళ్లు వద్దని ఎంతో మంది లబ్దిదారులు తమ పట్టాలను వెనక్కి ఇచ్చారన్నారు. 'జగనన్న ఇళ్లు..పేదలందరికీ కన్నీళ్లు పేరుతో' ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జగనన్న మోసం, జగనన్న ఇళ్లు...పేదలందరికీ కన్నీళ్లు అన్న ఫ్లైకార్డులతో ఈ కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేస్తామన్నారు. గత ప్రభుత్వం పేదలకు కేటాయించిన టిడ్కో గృహాలను లబ్దిదారులకు ఇవ్వలేదన్నారు.వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు దాటినా టిడ్కో గృహాలను మూలనపడేశారన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకట సుబ్బయ్య, పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయివిట్టల్, కోఆర్డినేటర్ తిరుమలశెట్టి సుధీర్, గుడిపల్లి వెంకయ్య, గాదంశెట్టి రవికుమార్, గుంటుపల్లి కృష్ణయ్య, మధుసూదన్‌రావు, తోకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముద్దాయిల నడవడికపై ప్రత్యేక నిఘా



**కోవూరు, నవంబరు11 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ కేసుల్లో ఉన్న ముద్దాయిల నడవడిక మీద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి తెలిపారు.స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మా టాడుతూ ఇటీవల కాలంలో కోవూరు స్టేషన్ పరిధిలో చిన్న చిన్న కారణాల వలన హత్యలు కూడా జరిగాయన్నారు. ఈ సంఘటనను పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తుంద న్నారు. ఇప్పటికే ఈ కేసులోని ముద్దాయిలందరినీ అరెస్టు చేయ డం, వారందరిపై కూడా రౌడీ షీట్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. చిన్న చిన్న కారణాలతో ఇలాంటి చర్య లకు పాల్పడిన వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు రావాలే తప్ప ఇటువంటి నేరాలకు పాల్పడవద్దని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఇటువంటి కేసుల్లో ఉన్న ముద్దాయిలకు ప్రతివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ నిర్వ హించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి. వెంకటేశ్వరరావు ఉన్నారు.

## మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**ఇనమడుగు(కోవూరు,) నవంబరు11 ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల కొరకు ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అని ఎంఈవో రహీమ్, ఏపీఎం వెంకటస్వామి పేర్కొన్నారు. కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం వారు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక పాటించాలన్నారు. ప్రభుత్వం అందించే కోడిగుడ్లు, చిక్కీలు ప్రతి విద్యార్థికి అందాలన్నారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా విద్యార్థులకు భోజనం అందించే సమయంలో తప్పనిసరిగా గ్లౌజ్ వేసుకుని పలు నియమాలు పాటించాలన్నారు. శుక్రవారం విద్యార్థులకు అందించిన ఆకుకూర, పప్పు,గుడ్డును అధికారులుతిని, ఇదే నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏజెన్సీకి సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఘనంగా శ్రీ భక్త కనకదాసు జయంతి



**నెల్లూరు టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వారి కార్యాలయంలో శ్రీ భక్త కనకదాసు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ భక్త కనకదాసు చిత్ర పటానికి జిల్లా అధికారి వై.వెంకటయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకదాసు 1509లో జన్మించి 1609లో తుది శ్వాస విడిచారని, అంటే నిండు నూరేళ్ల జీవించాలని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని గొప్ప భక్తుడిని ఆధునిక కవి, తత్వవేత్త సంగీతకారుడని చెప్పారు. కనకదాసు కర్ణాటక సంగీతం కోసం కన్నడ బాషలో రచించిన కీర్తనలు, ఉప భాగాల వలన ప్రాచుర్యం పొందారని, ఇతర హరిదాసులవలె జనకదా కీర్తనల్లో సాధారణ కన్నడ బాషను ఉపయోగించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొని ఘనంగా నివాళి అర్పించారు.

## ఇరిగేషన్ కాలువకు పూడిక తీయించాలి



**కోవూరు, నవంబరు11 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో ఇరిగేషన్ కాలువలు గుర్రపుడెక్కలతో దట్టంగా నిండి ఉన్నాయని, వెంటనే వాటిని పూడిక తీయించేలా అధికారులు దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. కోవూరులోని శాంతినగర్ రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల యాంత్రీకరణ పథకం కింద ట్రాక్టర్లు పొందిన రైతులకు సబ్సిడీ నిధులు వారి వారి ఖాతాలో జమకాలేదన్నారు. ఈ విషయమై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుజాత మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ సీజన్‌కు సంబంధించి కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్, స్టాక్ సిద్ధంగా ఉంచామన్నారు. అదేవిధంగా ఈ సీజన్‌కు సంబంధించి రైతులు జింక్ సల్ఫేట్‌ను దుక్కిలోనే వేసుకోవాలని సూచించారు. దుక్కిలో వేయలేని రైతులు పైపాటుగా జింక్ సల్ఫేట్‌ను పిచికారి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సలహా మండలి సభ్యులు సుధీర్‌రెడ్డి, రైతులు , వ్యవసాయ శాఖ సహాయకులు ఉన్నారు.

## సర్వే పారదర్శకంగా సాగాలి



**కోవూరు, నవంబరు11 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్ల ద్వారా నిర్వహించనున్న సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టేలా సంక్షేమ శాఖ సహాయకులు చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయంలో పనిచేస్తున్న సంక్షేమ శాఖ సహాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో ప్రధానంగా ప్రజల ఆరోగ్యం , పరిసరాల పరిశుభ్రత, అక్షరాస్యత, మాతా శిశు సంరక్షణ, తదితర అంశాలకు సంబంధించి చేపట్టనున్న ఈ సర్వేను ప్రభుత్వం నిర్దేశించిన విషయాలతో కలిపి చేపట్టాలన్నారు.

## నాసా పోటీలకు చైతన్య విద్యార్థులు ఎంపిక



**కోవూరు, నవంబరు11 ప్రభాతవార్త :** కోవూరులోని శ్రీ చైతన్య ఆంగ్ల పాఠశాల విద్యార్థులు అమెరికాలోని నాసా వారు నిర్వహించిన పోటీల్లో ఈ పాఠశాలకు సంబంధించిన 17 మంది విద్యార్థులు పంపిన మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాసా కిట్లను తహసీల్దార్ ఎం. పద్మజ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు ఇటువంటి ప్రయోగాత్మక పరిశోధనల వలన భవిష్యత్తులో వారు మంచి శాస్త్రవేత్తలుగా తయారవుతారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి సాంకేతిక అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం కొండారెడ్డి, ప్రిన్సిపాల్ హనుమంతరావు, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ బాషా, అకడమిక్ డీన్ పెంచలబాబు, విద్యార్థులు ఉన్నారు.

## ఆటో క్యాడ్ సాఫ్ట్‌వేర్ ఎంతో ఉపయోగకరం



**కోవూరు, నవంబరు11 ప్రభాతవార్త :** పరిశ్రమల్లో వివిధ బిల్డింగులు డెవలప్ చేయుటకు ఎంతో ఉపయో గపడుంతని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 7వ తేది ప్రారంభమైన బిల్డింగ్ డ్రాఫ్టింగ్ యూసింగ్ ఆటో క్యాడ్ వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇంజనీరింగ్ విద్యార్థుల ఉద్యోగ అభివృద్ధి కొంకు ఈ వర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా మూడవ సంవత్సరం విద్యార్థులకు బిల్డింగ్ డిజైనింగ్‌పై మరింత అవగాహన పెంచేందుకు ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు సివిల్ విభాగాధిపతి పి. ఉమా సాయికృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ గీతాంజలి కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు ఐఐసీసీ విభాగాధిపతి పి. చక్రపాణి తెలిపారు.సమన్వయకర్త వి. రాధాకృష్ణ, శిక్షకులు కె. శ్రీకాంత్ బ్రహ్మారేష్, అధ్యాపకులు ఉన్నారు.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



**నెల్లూరు టౌన్, నవంబరు 11, ప్రభాతవార్త:** నెల్లూరు ఆటోనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ టి.కామేశ్వరి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, దేశ మొదటి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సరమయోధుల త్యాగాలు మరువరానివని, ఆయన విద్యావిధానంలో అనేక మార్పులు ప్రవేశపెట్టి గణనీయమైన సేవలు అందించారన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొనియాడారు. అనంతరం గెజిటెడ్ హెడ్‌మాస్టర్ సయ్యద్ అబ్దుల్ హమీద్ మౌలానా అబుల్ కలాం జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామిత్వపై శిక్షణ

**జలదంకి,నవంబర్11,ప్రభాతవార్త:** స్తానిక ఎం.పి.డి.ఒ కార్యాలయంలో శుక్రవారం వై.ఎస్.ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూరక్ష పదకంపై శిక్షణాకార్యక్రమం నిర్వహించారు.ఇన్‌చార్జ్ ఎం.పి.డి.ఒ శ్రీధర్ అధ్యక్షతన జరిగిన అవగాహనలో తహసిల్‌దార్ పద్మావతి మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వందేళ్ళ అనంతరం ఈమహత్తర కార్యక్రమం చేపట్టిందని దీనిద్వారా గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో వ్యవసాయ,గ్రామ కంఠం ,స్తిరాస్తులు సర్వే చేపట్టి సమస్యలు శాశ్వత పరిష్కారం దిశగాముందడుగు పడుతుందని అన్నారు.కావున అందరూ దీనిపై సమగ్ర అవగాహనతో పదక విజయవంతానికి కృషిచేయాలని పిలుపునిచ్చా రు.ఈకార్యక్రమంలో ఇ.ఒ.పి.ఆర్ అండ్ ఆర్.డి ఆదినారాయణ,డిప్యూటి తహసిల్‌దార్ భరత్,వి.ఆర్.ఒ లు,పంచాయతీ కార్యదర్శులు,సర్వేయర్లు,డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు,లోకేష్ ఎక్కడ గెలవలేరు





**బుచ్చి నవంబర్ 11 ప్రభాతవార్త** చంద్రబాబునాయుడు,లోకేష్ ఎక్కడా గెలవలేరని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎద్దేవ చేశారు.బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల గ్రామ పంచాయితీలో 6 లక్షల రూపాయాలు ఎంపిపి నిధులతో నూతనంగా నిర్మించిన త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని అలాగే ఎంజిఎ న్ఆర్ ఇజిఎస్ 50 శాతం మరియు ఆరోగ్య శాఖ 50 శాతంతో 17.50 లక్షలతో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్ ఆర్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభారు.అనంతరం గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గోన్న ఆయన మాట్లాడుతు కుప్పంలో స్దానిక సంస్దల ఎన్నికలలో పరాజయం పాలైన విషయం చంద్రబాబు గుర్తు చేసుకోవాలని అన్నారు.కుప్పంలో ఆర్‌డిఓ కార్యాలయం పెట్టించింది మా నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన స్పష్టం చేశారు.పులివెందలలో తెలుగుదేశం పార్టీకి ఆదరణ పెరిగిందని చంద్రబాబునాయుడు అనడం హాస్యస్పదంగా ఉందని అన్నారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దివంగతనేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి,నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పులివెందలను అద్బుతమైన అభివృద్ది చేశారని అన్నారు.సింహం కడుపున సింహామే పుడుతుందని కొనియాడారు.దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పధకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. రేబాల పంచాయితీలో 3 సచివాలయాల పరిధిలో 20 కోట్లా 23 లక్షలా 69 వేలు సంక్షేమపధకాలకు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.నవంబర్‌లో 21 లక్షలా98 వేలు పెన్షనకు ఇవ్వడం జరిగిందని చెప్పా రు.ని యోజ కవర్గంలో 31 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 31 వేలా 845 గడపలు తిరగడం జరిగిందని అన్నారు,ప్రజలు ఎక్కడికి వెళ్లినా విశేష ఆదరణ చూపుతున్నారని అన్నారు.ఇతర పార్టీల నాయకులు కూడా జగనమోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు.ఈకార్యక్రమంలో భాగంగా ఎంజిఎన్ఆర్‌జిఎస్ 90 శాతం వ్యవసాయశాఖ 10 శాతం నిదులతో 20.80 లక్షలతో నూతనంగా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వభవనం ప్రారంబోత్స వం చేశారు.ఈకార్య క్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ జిల్లా ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి,పెన్నాడెల్లా ప్రాజక్టు మాజీ ఛైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి,వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి,ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు,బుచ్చినగరపాలక ఛైర్మన్ మోర్ల సుప్రజ,తహసిల్దారు ప్రమీలా,ఎంపిడిఓ నరసింహరావు,సీనియర్‌నాయకులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి,మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, రేబాల సర్పంచ్ లఘంతోటి బాగ్యలక్ష్మీ,లఘంతోటి మస్తానయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి,దయాకర్‌రెడ్డి,కృష్ణారెడ్డి,నాగసుబ్బారెడ్డి,కౌన్సి లర్లు షేక్ షకిలాబేగం,కలికి యానాదిరెడ్డి,రాచూరు సత్యనారాయణ,జైరామిరెడ్డి, అగ్రికల్చర్ ఏఇ సురేంద్రరెడ్డి, పంచాయితీరాజ్ఏఇ శ్రీనివాసులురెడ్డి,మల్లికార్జున,మోర్ల మురళీ ,కౌన్సి లర్ చీర్ల ప్రసాద్‌యాదవ్,ఎస్ఐ వీరప్రతాప్, గ్రామ కార్యదర్శి శ్యామ్,పలువురు వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## శివాలయంలో ఎమ్మెల్యే మేకపాటి పూజలు



**సీతారామపురం నవంబర్ 11 ప్రభాతవార్త** మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన గటిక సిద్దేశ్వరంలో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నియోజకవర్గ వైసిపి ప్రచార కార్యదర్శి శాంతికుమారితో కలిసిప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారిని స్వాగతించారు.ఈ సందర్భంగా గణపతిపూజ నిర్వహించి శివుడుకి ప్రత్యేకాభిషేకాలు చేశారు.ప్రత్యేకంగా అలం కరించి ఇష్టకామేశ్వరమ్మవా రికి,కాశీనాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ద్వజస్తంభం వద్ద 360 దీపాలు వెలగించి పూజలు చేశారు.ఆలయ అర్చకులు,కమీటి సభ్యులు ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డిని,శాంతి కుమారిని పూలమాలలు,శాలువాలతో సత్కరించారు. అనంతరం సిద్దేశ్వరం యొక్క ప్రాముఖ్యతను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్బంగా ఆయన విలేఖర్లు తోమాట్లాడుతు 2024లో తప్పకుండా వైసిపి అధికారంలోకి వస్తుందని జగన్‌మోహన్‌రెడ్డి సిఎం కావడం తధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం



**అల్లూరు, నవంబరు 11 ప్రభాతవార్త** అల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం 3వ రోజు అలూరు క్రిస్టియన్‌పేట నుండి శుక్రవారం కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ఒక్కో కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాల కరపత్రాలు అందజేసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా జన్మభూమి కమిటీలను అడ్డుపెట్టుకొని పథకాలు ప్రజలకు అందించడంలో విఫలయ్యారని విమర్శించారు. అందుకు భిన్నంగా అవినీతికి తావులేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలోవాలంటరీలు ముందు వరుసలో వున్నారన్నారు. రాబోవు రోజుల్లో జగనన్న ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీరామకృష్ణ, కమిషనర్ పణికుమార్,ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, సామంతుల సురేష్‌రెడ్డి, దైవాదీనం, మేడా రమణారెడ్డి, కోడూరు సాధక్‌రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, పెనుబోలు సుధీర్‌రెడ్డి, జాంబి, హౌసింగ్ ఎఇ జలీల్, నగర పంచాయతీ ఎఇ వినోద్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కావలి డిఎస్పీ వెంకట రమణను సత్కరించిన ఎమ్మెల్యే



**కావలి, నవంబరు 11 ప్రభాతవార్త** కావలి నూతన డిఎస్పీ వెంకట రమణను కావలి డిఎస్పీ కార్యాలయంలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దుశ్శా లువతో సత్కరించి పూలబొకె అందజేశారు. అనంతరం డిఎస్పీతో ముచ్చటించారు. ఎమ్మెల్యే వెంట శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, వైసిపి నేతలు గంధం ప్రసన్నాంజనేయులు, చెన్నాయపాళెం ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



**కావలి రూరల్, నవంబరు 11 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం రుద్రకోట జాతీయ రహదారి పక్కన వేంచేసి వున్న అయ్యప్పస్వామిని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం దర్శించుకు న్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సా దరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అక్కడ జరుగుతున్న అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని తన చేతుల మీదుగా భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి



**మర్రిపాడు, నవంబర్11,ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వస్తున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరులోని మేకపాటి కార్యాలయంలో డిఎల్‌డిఓ , నియోజకవ ర్గంలోని అన్ని మండలాల ఎంపిడిఒలు, మున్సి పల్ కమీషనర్‌తో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాను చేపడుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వస్తున్న సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్నాల పథకాలు అందజేసేందుకు ఉండే సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రెండునెలలకొకసారి రివ్యూ చేపడతామని, సమస్యలను పరిష్కరించడంలో ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం చేపట్టబోయే గ్రామాల్లోనే ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కారం చూపెట్టాలన్నారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** వర్షాకాలపు సమస్యలను దృష్టిలో ఉంచుకని సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్యదర్శులు స్థానికంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు కృషి చేయాలని, విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించి క్షేత్ర స్థాయి వరకు ప్రజలకు సంక్షేమం అందేలా బాధ్యత వహించాలని కమిషనర్ డి.హరిత సూచించారు. స్థానిక 23/1, 23/2 రాజువారి వీధి, పోలేరమ్మ చెరువు వీధి సచివాలయాలను కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి, సచివాలయం పరిధిలోని గృహాలు, కమర్షియల్ భవనాలన్నింటికీ చెత్తసేకరణ బిన్స్ పంపిణీ చేశారా అని విచారించారు. కమర్షియల్ ఆస్తి పన్నులతో పాటు ఇంటింటి చెత్త సేకరణకు యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సచివాలయం కార్యదర్శులకు ఆదేశించారు.మంచినీటి కొళాయిల నూతన కనెక్షన్ల మంజూరుకు ప్రజల్లో అవగాహన పెంచాలని, అనుమతులులేని కనెక్షన్లపై తగినచర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యదర్శు లంతా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ప్రతి రోజూ తప్పక ధరించాలని కమిషనర్ సూచించారు.

## బివిఎస్ బాలికల పాఠశాలలోని నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** సఫాయి మిత్ర సురక్షా చాలెంజ్‌కు సంబంధించిన కోటి రూపాయల నిధులతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బివిఎస్ బాలికల పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను వేగవంతం చేసి అతి త్వరలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకోనున్నట్లు కమిషనర్ డి.హరిత తెలియజేశారు. స్థానిక 7వ డివిజన్‌లోని పాఠశాలను కమిషనర్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉన్నత స్థాయిలో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్,టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టుల నిర్మాణం జరుగుతుందని, విద్యార్థులకు వ్యాయామం, శారీర పటుత్వం పెరిగేలా ఆయా క్రీడలు దోహదపడుతాయని కమిషనర్ తెలిపారు. ఈఈ చంద్రయ్య, ఏఈ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్లు పేరుతో పేదలను మోసగించిన ప్రభుత్వం




**నెల్లూరు,నవంబరు11 ప్రభాతవార్త-విద్య** నవరత్నాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రదాన హామీ జగనన్న ఇళ్లుఅని అధికారంలోని వచ్చి నాలుగేళ్లు పూర్తిఅవుతున్నా ఇంతవరకు లబ్దిదారులకు ఇళ్లు ఇవ్వకుండా మోసగించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని జనసేన నగర అధ్యక్షులు దుగ్గి శెట్టి సుజయ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక జనసేన జిల్లా ప్రధానకార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జగనన్న ఇళ్ల నిర్మాణంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని తమ అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు నేటినుండి మూడురోజులపాటూ జగనన్న ఇళ్ల బండారాన్ని బట్టబయలు చేయనున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా జగనన్న ఇల్లు-ప్రజల కనీళ్లు పేరుతో డిజిటల్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ ఇందులో భాగస్వామలులు అవ్వాలని, వారి వారి ప్రాంతాల్లో జగనన్న ఇండ్ల ప్రస్తుత పరిస్థితిని సోషల్‌మీడియాలోపోస్తు చేయాలని పిలుపునిచ్చారు.అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రాష్ట్రంలోని 68వేల ఎకరాల్లో 28లక్షల ఇండ్లు కట్టి పేదలకు అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వెన్ను చూపించటం దారుణమన్నారు. నెల్లూరు నగరంలో 10వేల ఇండ్లను పేదలకు అందిస్తామన్నా నాయకుల మాటలు నీటి మీద రాతల్లా మారిపోయాయన్నారు. అనవసరపు సంక్షేమాన్ని ప్రజలపై రుద్ది రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఎద్దేవా చేశారు. జగనన్న ఇండ్లు నిర్మాణం పక్కన పెడితే గత ప్రభుత్వ హయాంలో జనార్ధన్‌రెడ్డి కాలనీ, అల్లీపురం ప్రాంతాల్లో నిర్మాణం పూర్తిచేసుకున్న వందలాది ఇళ్లను కూడా అబ్దిదారులకు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం మెసగించిందన్నారు. రానున్న రోజుల్లో తమ జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో టిక్కో ఇల్లను పరిశీలించి లబ్దిదారులకు అండగా నిలిచే కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు.జగన్‌ప్రభుత్వం పేదలకు ఇండ్లు కార్యక్రమంలో చేసిన అవినీతి, అలసత్వాన్ని ప్రజలకు తెలిపేందుకు చేపడుతున్న డిజిటల్ క్యాంపెయిన్‌లో అందరూ పాల్గొని విజయవతం చేయ్యాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బద్దిపూడిసుధీర్,జిల్లా ప్రధాన కార్యదర్శి గునుగుల కిషోర్, నాయకులు కృష్ణారెడ్డి, షేక్ ఆలియా, ప్రశాంత్, హేమంత్, సాయి మోహన్, జీవన్,అక్కిశెట్టి శ్రీదర్, సురేష్, శ్రీకాంత్,వినయ్‌కుమార్, పృది వ్, కన్నార్,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతి పాఠశాల గుర్తింపును రద్దుచేయాలంటూ వినతి



**నెల్లూరు,నవంబరు11 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక నవాబుపేట రవీంద్ర భారతి పాఠశాల గుర్తింపును తక్షణం రద్దుచేయ్యాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్ధి జెఏసీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి డిమాండ్ చేశారు. ఈమేరకు వినతిపత్రాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడి మేరి గ్లోరికి శుక్రవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రవీ ంద్రభారతి పాఠశాలలో4వ తరగతి చదువుతున్న విదా ్యర్ధిని టీచర్ కర్రతో కొట్టడంతో విద్యార్ధికి కన్ను పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో అదే పాఠశాలకు చెందిన గూడూరు శాఖ బస్సు ప్రమాదంలో అనేకమంది చిన్నారులు గాయపడ్డారని గుర్తుచేశారు. విద్యార్థులు హోంవర్కు చేయలేదని మూడురోజులపాటూ మోకాళ్లమీద కూర్చొబెట్టిన ఘనతకూడా ఆ విద్యాసం స్థలకే దక్కుతుందన్నారు. ఆయా పాఠశాలల్లో టీచర్లు విదా ్యరు ్ధలను చదువు చెప్పకుండా హింసిస్తున్నారు అనేందుకు నిన్న జరిగిన సంఘటన ప్రత్యక్ష్య నిదర్శనమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆ పాఠశాల గుర్తింపును వెంటనే రద్దుచేయ్యాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జెఏసీ నాయకులు శ్రీకాంత్, బాలు, జాన్‌బెన్నీ,సుహేబ్,కిశోర్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు , ఆయాలకు నియామకపత్రాలు పంపిణీ



**ఆత్మకూరు,నవంబర్11,ప్రభాతవార్త:** ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆరుమంది హెల్పర్లకు సిడిపిఒ ఎం.పద్మావతి ఆధ్వర్యంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఎంపికైన వారందరూ వృత్తిపట్ల శ్రద్ధ చూపుతు చిన్నారులను బాగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ, దేపూరు సెక్టార్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, వైసిపి నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

## క్రీడలకు అధిక ప్రాధాన్యత



**ఆత్మకూరు,నవంబర్11,ప్రభాతవార్త:** ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అధికా ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి జయంతిని పురస్కరించుకొని ఎంజిఆర్ ఫౌండేషన్ తరపున కళాశాల, పాఠశాల విద్యార్థులకు ఇటీవల క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది క్రీడలకు ప్రోత్సా హకంగా లక్ష రూపాయలు కేటాయించినట్లు, రానున్న ఏడాదిలో ఎంజిఆర్ క్రీడలకు బాల బాలికలకు సమానంగా పోటీలు నిర్వహించాలని పాఠశాల పిఇటిలకు సూచించారు. బహుమతుల కోసం 5లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సిఎం కప్ పోటీలను నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతల నుండి అత్యధికంగా ఆణిముత్యాల్లాంటి క్రీడలను వెలుగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో క్రీడాకారుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదని, కాలానుగుణంగా మార్పు చెంది క్రీడాకారుల పరిస్థితి మెరుగ్గా ఉందని, చదువులతోనే కాకుండా క్రీడలతో కూడా ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులను ప్రోత్స హించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని క్రీడాకారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా వివిధ ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థుల టీమ్‌లకు మెడల్స్, ప్రైజ్ తోపాటు నగదు, ట్రోపీలను అందజేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈకార్యక్రమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ విజయవంతం కావాలి



**కోవూరు, నవంబరు11 ప్రభాతవార్త :** పెండింగ్ కేసు పరిష్కారానికి కోవూరులోని కోర్టు ప్రాంగణంలో ఈ నెల 12వ తేది శనివారం జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా న్యాయవాదులు సంబంధిత పోలీస్ శాఖ అధికారులు కృషి చేయాల్సి న అవసరం ఉందని సీనియర్ సివిల్ జడ్జి సి. మురళీధర్ పేర్కొన్నారు. కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శుక్రవారం న్యాయవాదులు , పోలీసు అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి వీలు పడే కేసులన్నింటినీ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో పరిష్కారమయ్యే కేసులకు పూర్తిస్థాయిలో చట్టభద్రల ఉంటుందన్నారు. కేసుల పరిష్కారం కోసం కోర్టుల చుట్టు తిరుగుతూ విలువైన కాలాన్ని వృథా చేసుకుంటున్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె. కాత్యాయినీ, ప్రిన్సి పాల్ జూనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, తదితరులు ఉన్నారు.

## ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్

**నెల్లూరు కార్పొరేషన్, నవంబరు 11, ప్రభాతవార్త:** జిల్లాలో ఈ నెల 12వ తేదీన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు జిల్లాలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని అధ్యక్షతన ఈ నెల 12వ తేదీన నెల్లూరు నగరంలోని న్యాయ స్థానాల సముదాయంలో గల న్యాయ సేవా సదన్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర న్యాయస్థానాల్లో కూడా ఇదే రోజున జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అన్ని సివిల్, కాంపౌండ్, క్రిమినల్ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు సంబంధిత న్యాయాధికారులు కృషి చేయాలని వారు సూచించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ందిగా వారు కోరారు.

